విద్యుత్ చార్జీల పెంపుపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- వైఎస్సార్ సీపీ పోరుబాటకు జనం మద్దతు
- నిరసన ర్యాలీలో భారీగా పాల్గొన్న ప్రజలు
- విద్యుత్ చార్జీలు తగ్గించాలని మాజీమంత్రి వెలంపల్లి డిమాండ్



విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ నిరసన ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు


నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి 43వ డివిజన్ ఊర్మిళానగర్ నుంచి ఏకలవ్యనగర్ మీదుగా జోజీనగర్ రోడ్‌లోని కబేళా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జిలను తగ్గించాలని కోరుతూ అక్కడ విద్యుత్‌శాఖ ఏఈ సతీష్‌కు వినతిపత్రం అందచేశారు. తొలుత ఊర్మిళానగర్ పార్క్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. నిరసన ర్యాలీని ఉద్దేశించి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, కుదిరితే తగ్గిస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన సీఎం చంద్రబాబు, తీరా అధికారాన్ని చేపట్టాక ప్రజలపై రూ.15వేల కోట్ల భారం మోపి వారి నడ్డి విరిచారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో క్రమం తప్పకుండా అమలుచేసిన 'అమ్మఒడి', 'రైతు భరోసా' 'ఫీజు రీయంబర్స్‌మెంట్' తదితర సంక్షేమ పథకాలను నిలుపుదల చేసి అన్నివర్గాల ప్రజలను మోసం చేశాడని దుయ్యబట్టారు. అందుకే చంద్రబాబును నమ్మి ఓట్లేసి తప్పు చేశామని ప్రజలు బాధపడుతూ ఈరోజు రోడ్డెక్కారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వార్డ్, గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందించామని గుర్తు చేశారు. అటువంటి పాలనే తిరిగి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన ఒక్క హామీలను అమలుచేయలేదన్నారు. ఆయా హామీలను అటకెక్కించిన చంద్రబాబు, ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజలపై భారాలు మోపకుండా సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాబోరి బాదుడే..బాదుడుపై పెల్లుబికుతున్న ప్రజాగ్రహంలో కొట్టుకుపోక తప్పదని హెచ్చరించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబుకు ఆదినుంచి అలవాటేనని విమర్శించారు. ఏదో ఒక తోకపార్టీ సాయంతో తప్ప వైఎస్ జగన్ మాదిరిగా ఒంటరిగా పోటీచేసే సత్తా చంద్రబాబుకు లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గోరుచుట్టుపై రోకటి పోటు చందాన రాష్ట్రప్రజలపై ఇప్పుడు రూ.15వేల కోట్లకు పైగా విద్యుత్‌చార్జీలు పెంచి పేదలకు షాక్ ఇచ్చారని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పి. చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, మాజీ చైర్మన్లు తోలేటి శ్రీకాంత్, కర్నాటి రాంబాబు, భారీసంఖ్యల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యుత్ ఏఈ సతీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, నాయకులు

పేదల నడ్డి విరిచారు..



అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచే ప్రసక్తే లేదని ఊరూరా తిరిగి ప్రజలకు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఆ హామీని మరిచి ఇప్పుడు కరెంట్ చార్జీల పెంచడం ద్వారా పేదల నడ్డివిరిచారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు ఇచ్చిన 200 యూనిట్లకు కూడా కోత పెట్టడం దుర్మార్గం. ఎస్సీ, ఎస్టీలకు ఆ సబ్సిడీని కొనసాగించాలి. నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పెంచిన విద్యుత్‌చార్జీలను తగ్గించి, ప్రజలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– పొదిలి చంటిబాబు, ఎస్సీ నాయకుడు

సంపద సృష్టించడమంటే ఇలానా సార్...



సంపద సృష్టిస్తా..రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తా అంటే ఎలా చేస్తారా అని ఆలోచిస్తున్నాం. ప్రజలపై వేల కోట్ల రూపాయల విద్యుత్ భారం మోపడం ద్వారా కూడా సంపద సృష్టించవచ్చని సీఎం చంద్రబాబు సార్ మా కళ్లు తెరిపించారు. దుకాణంలో గుమస్తాగా పనిచేసే నాకు గతంలో కరెంట్ బిల్లు రూ.250 వచ్చేది. ప్రస్తుతం రూ.600 వస్తోంది. పెరిగిన నిత్యావసరాల ధరలకు భారీగా పెంచిన కరెంటు బిల్లులను పేదలం ఎలా చెల్లించగలం. పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలి.

– ఎస్.రమణారెడ్డి, ఊర్మిళానగర్.

ఇదెక్కడి బాదుడు..



అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని... వీలైతే తగ్గిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాకా తగ్గించకపోగా రెట్టింపు వడ్డిస్తున్నారు. రెండు గదుల రేకుల షెడ్‌లో అద్దెకు ఉంటూ టిఫిన్ బండితో కుటుంబాన్ని పోషించుకునే నాకు కరెంటు బిల్లు గతంలో రూ.300 నుంచి రూ.400 మధ్య వచ్చేది. ప్రస్తుతం కరెంట్ బిల్లు రూ.1100 నుంచి రూ.1200 వరకు వస్తోంది. ఇంత భారం మోపుతారా? ఇదెక్కడ బాదుడే బాదుడు బాబోరూ..మీ విజన్‌కో నమస్కారం.

– బోలెం శ్రీకాంత్, కుమ్మరిపాలెం సెంటర్

క్లుప్తంగా

నేటి నుంచి బాలోత్సవం వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికి విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏటా బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘ చైర్మనమురళీ మోహన్ అన్నారు. ముత్యాలంపాడులో శుక్రవారం విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించబోయే బాలోత్సవం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28, 29 తేదీల్లో ఎనికేపాడు విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో 11వ బాలోత్సవం వేడుకలు కనులపండువగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. రెండు రోజుల పాటు జరిగే బాలోత్సవంలో నగరంలోని పాఠశాలలకు చెందిన 10వేలకు పైగా విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శిస్తారని తెలిపారు. బాలోత్సవంలో ఉత్తమప్రదర్శనలు చేసిన విద్యార్థులకు పురస్కారంతో సత్కరిస్తామని చెప్పారు. సంఘ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, కార్యదర్శి సీహెచ్ హరినాథ్, కోశాధికారి ఈశ్వర్ బాలోత్సవం కరపత్రాలు ఆవిష్కరించారు.

300 మందికి ఉచిత పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కోస్టల్ బ్యాంక్ రజతోత్సవం పురస్కరించుకుని ప్రజాశక్తి నగర్ బ్రాంచిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, నేత్ర దంత వైద్యులు పాల్గొని సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీలతో పాటు, ఎముకల సాంద్రత పరీక్షలు చేసి, అనారోగ్య లక్షణాలు ఉన్న వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో దీపక్ హాస్పటల్ డాక్టర్ ముక్తినేని వెంకట మధుసూదనరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత వైద్య శిబిరాన్ని స్వాతి ఎడిటర్ వేమూరి బలరామ్ ప్రారంభించగా, బ్రాంచి హెడ్ జి. శశాంక తదితరులు పాల్గొన్నారు.

రేపు శారద కాలేజీ గోల్డెన్ జూబ్లీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని శారద కళాశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 29న గోల్డెన్ జూబ్లీ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శారద కళాశాల 50 ఏళ్లుగా ఎందరో విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిందని తెలిపారు. గోల్డెన్ జూబ్లీ సందర్భంగా దేశవిదేశాల్లో ఉన్నవారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రారంభం నాటి నుంచి ప్రస్థానాన్ని వివరించారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రముఖ మ్యాట్రిక్స్ సంస్థ శుక్రవారం నగరంలో నిర్వహించిన లుక్ , లెర్న్ షో విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షో ఆహూతులను అబ్బురపరిచింది. నగరానికి చెందిన సుమారు 500 మంది సెలూన్ బ్యూటీపార్లర్ యజమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మ్యాట్రిక్స్ సౌత్ రీజినల్ సేల్స్ హెడ్ రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి హెయిర్ స్టైలింగ్, కలరింగ్‌లో వస్తున్న నూతన పరిజ్ఞానాన్ని వివరించారు. సెలూన్, బ్యూటీ పార్లర్ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన తెలిపారు . అనంతరం నిర్వహించిన ఫ్యాషన్ షోలో వెస్టర్న్ దుస్తులు ధరించిన మోడల్స్ చేసిన ర్యాంపు వాక్ అందరినీ ఉర్రూతలూగించింది. కార్యక్రమంలో నిర్వాహక సంస్థ రీజనల్ ట్రైనింగ్ హెడ్ సురేష్ కుమార్, ప్రతినిధులు అజయ్ కుమార్ మాజేటి, రాము, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డెర ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

పటమట(విజయవాడతూర్పు): ఏపీలో 40 లక్షల జనాభా ఉన్న వడ్డెర, వడియ రాజుల కులానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఏపీ వడియారాజుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు, హైకోర్టు అడ్వకేట్ వేముల బేబీరాణి శుక్రవారం ఓ ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడియారాజుల ఆరాధ్య దైవమైన వడ్డెర ఓబన్న జయంతి జనవరి 11వ తేదీన అధికారికంగా నిర్వహిచాలని ఆమె డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ 33/11 కేవీ మిల్క్ ప్రాజెక్ట్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా శనివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు సయ్యద్ అప్పలస్వామి కాలేజీ వెనుక పక్క వీజీఎస్ పబ్లిషర్స్, రాజీవ్‌శర్మ నగర్, లంబాడీ పేట, సాయిరాం థియేటర్ ఏరియా, కలరా హాస్పటల్ ఏరియా, కుండల మార్కెట్, సౌమ్య సినిమాహాల్ తదితర ఏరియాల్లో కరెంట్ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కబేళా సబ్‌స్టేషన్ పరిధిలో..

విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కేకేనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8నుంచి 11గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రవీంద్రబాబు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా జోజీనగర్, లక్ష్మీనగర్ కాలనీ, చర్చి రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, టీవీ కృష్ణారావు వీధి, ఆర్కే పబ్లిక్ స్కూల్ ఏరియా, బీరువాల కంపెనీ రోడ్డు, సంజయ్‌గాంధీ కాలనీ, కామకోటినగర్ పోస్ట్ ఆఫీస్ ఏరియా, శంకరమఠం ఏరియా, గురుకృప రోడ్డు, పార్థసారథి వీధి, మానవమందిరం రోడ్డు, కోళ్లఫారం రోడ్డు తదితర ఏరియాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

వాహనాల లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ పరం చేయొద్దు

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా


లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఆటో, మోటార్ కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఆటో, మోటార్ రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు అన్నారు. లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పడంతో మరింత భారం పడుతుందన్నారు. వీటిని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కె.దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్ట సవరణలు చేసి ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తోందన్నారు. బీజేపీ విధానాలను రాష్ట్రంలో టీడీపీ కూటమి అమలు చేస్తోందని మండిపడ్డారు. దీని వలన ఆటో, మోటార్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయకుండా లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ విధానాన్ని ప్రైవేటుపరం చేస్తోందన్నారు. ఇప్పటికే వోలా, ఊబర్, రాపిడ్ వంటి విదేశీయాప్ ల వలన ఆటో కిరాయిలు తగ్గి పోయాయని, ఆటో, మోటార్ కార్మికుల కుటుంబాలు గడవలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. పాలకులు పట్టించుకోపోతే పెద్ద ఎత్తును ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.రూబెన్ కుమార్, సెంట్రల్ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, విజయవాడ సిటీ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు డి. కోటయ్య,ఎ.నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో డేటాసైన్స్ అత్యంత కీలకం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కోటారెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న కాలంలో అన్నిరంగాల అభివృద్ధికి డేటా సైన్స్ అత్యంత కీలకంగా మారనుందని విట్ ఏపీ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డేటాసైన్స్ అండ్ ఎంసీఏ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో స్ప్రింగర్ కాన్ఫరెన్స్ పేరుతో డేటాసైన్స్‌పై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ కొత్త సాంకేతికతలను అన్వేషించడంలో డేటా సైన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. భవిష్యత్‌ను నడిపించే సహకార సంబంధాలను పంచుకోవడం వంటి నూతన ఆవిష్కరణలకు డేటా సైన్స్ తోడ్పాటునందిస్తుందన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ డేటాసైన్స్ రంగంలో అద్భుతమైన ప్రగతి చోటు చేసుకుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులపై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సదస్సులో పలువురు సమర్పించిన పరిశోధనా పత్రాల సావనీర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, సంయుక్త కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్‌బాబు, విభాగాధిపతి డాక్టర్ షేక్ అక్బర్, కోఆర్డినేటర్ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ ప్రారంభం..

కళాశాల డిపార్ట్‌మెంట్ ఏఐ ఆధ్వర్యంలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు కొత్త ఆలోచనలకు రూపునిస్తాయని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ షణ్ముఖరావు, డాక్టర్ ఎస్వీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ట్రాఫిక్ నియమ, నిబంధనలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన ఉండాలని 5వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ చెప్పారు. స్థానిక వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. రవికుమార్ మాట్లాడుతూ సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణానికి వాహనచోదకులు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. రోడ్డుపై నడిచేటప్పుడు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. ఆటో, బస్సు, ఇతర వాహనాల్లో నుంచి చేతులు బయట పెట్టకూడదన్నారు. ఈ నిబంధనలు విద్యార్థులు పాటిస్తూనే తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు కూడా పాటించేలా చూడాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్రవాహనచోదకులే మృత్యువాత పడుతున్నారని దీంతో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జరిమానాలు, కేసులకు భయపడి చాలా మంది ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్‌ను కొనుగోలు చేస్తున్నారని, వాటిని ధరించడకుండా వాహనానికి తగిలిస్తున్నారన్నారు. పోలీసులు కనిపించినప్పుడే హెల్మెట్‌ను తలకు ధరిస్తున్నారన్నారు. హెల్మెట్ ఉన్నా ప్రమాదాలు జరిగినప్పుడు నష్టం ఎక్కువగా జరుగుతుందన్నారు. అందువల్ల వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం మేడా సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని తప్పనిసరిగా వాటిని అమలు చేయాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిస్‌ప్లే డివైజ్ ఫీజు కమిటీ ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, వీఎంసీ

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకునే డిస్‌ప్లే డివైజ్‌లు అన్నింటికీ వీఎంసీ అనుమతులు ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన పలు ఏజెన్సీలతో డిస్‌ప్లే డివైజ్ ఫీజు ప్రత్యేక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్‌ప్లే డివైజ్‌తో సంబంధం ఉన్న ఏజెన్సీలన్నీ త్వరితగతిన వీఎంసీ అనుమతులు తీసుకోవాలని, నగరంలో డిస్‌ప్లే డివైజెస్‌కు సంబంధించిన 28 ఏజెన్సీలు ఉన్నాయన్నారు. అందులో ఎనిమిది ఏజెన్సీల నిర్వాహకులు మాత్రమే హాజరయ్యారని, తదుపరి సమావేశంలో అందరూ హాజరవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దృష్టికి వచ్చిన పర్మిషన్ లెటర్, ట్రేడ్ లైసెన్స్, నగరపాలక సంస్థకు పెట్టుకున్న అర్జీలు పరిశీలించారు. వీఎంసీకి ఏజన్సీలు చెల్లించాల్సిన బకాయిలపై ఆరా తీశారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, సభ్యులు జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, ఇతర టౌన్ ప్లానింగ్ సభ్యులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత దేశాన్ని స్వావలంబన దిశగా పయనింప చేసిన మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక మేధావి అని కొనియాడారు. తాను విజయవాడ సిటీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో (1996) విజయవాడ వచ్చిన ఆయన్ని కలిసి జ్ఞాపిక అందించి సత్కరించిన ఘటనను గుర్తు చేసుకున్నారు. రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, ఆర్థిక సంస్కరణల సారథిగా నిలిచిన మచ్చలేని రాజనీతిజ్ఞుడిగా మన్మోహన్ సింగ్ దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తి రాజకీయాలలో అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘననివాళి

- రెండేళ్ల క్రితం దేశ మాజీప్రధాని మన్మోహన్ సింగ్ మృతి తీరనిలోటని విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులకు ఆశీస్సులు కోరుతూ విద్యార్థుల తరఫున ఉపాధ్యాయుడు పులిపాటి దుర్గారావు 2022లో మన్మోహన్‌సింగ్‌కు లేఖరాయగా, తిరిగి మన్మోహన్‌సింగ్ పంపించిన సందేశాన్ని పాఠశాలలో అందరూ గుర్తుచేసుకున్నారు. సాధించాలనుకున్న లక్ష్యాలు సఫలీకృతం కావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు మన్మోహన్‌సింగ్ ఆశీస్సులు అందించడాన్ని జ్ఞప్తి చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించినవారిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కస్టమర్ల విశ్వాసం, ఉద్యోగుల అంకిత భావంతో బ్యాంక్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందిస్తోందని కోస్టల్ బ్యాంక్ మేనేజర్ ఉండవల్లి రాంబాబు అన్నారు. ఏలూరు రోడ్డు సీతారాంపురం కోస్టల్ బ్యాంక్‌లో శుక్రవారం బ్యాంక్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి లోకల్ ఏరియా బ్యాంకు కోస్టల్ బ్యాంక్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ అన్నారు. బ్యాంక్ కస్టమర్లు కాంతీలాల్ పటేల్, కోటగిరి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన


విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న కార్మికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. 37వ డివిజన్‌లోని మున్సిపల్ కార్మికుల సర్వసభ్య సమావేశం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచనని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. పెంచిన ఛార్జీలను రద్దు చేయడమే కాకుండా, స్మార్ట్ మీటర్లను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనవరి ఏడో తేదీన జరిగే విద్యుత్ రెగ్యులేటరీ కమిషనర్‌కు సామూహిక విన్నతి రాయభారాల్లో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పెరిగిన విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తంచేవారు. కార్యక్రమంలో యూనియన్ నగర సర్కిల్ కార్యదర్శి ఈ సాములు, నాయకులు వినుకొండ మహేష్, బాబురావు, సుబ్బారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.